క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు



తాడిమర్రిలో తొట్టెలోని నీటిని పారబోయిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. తాడిమర్రి, నార్సింపల్లి, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, దాడితోట, కునుకుంట్ల, చిల్లవారిపల్లి, పిన్నదరి తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వీధుల్లో తిరుగుతూ అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయించారు. అనంతరం వారు ఇంటింటా పర్యటిస్తూ నీటి తొట్టెల్లోని నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత లోపిస్తే దోమలు వ్యాప్తి పెరుగుతుందన్నారు. దోమకాటుతో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా తదితర జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్ రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ: ఆర్డీటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిగుబ్బ సీఐ యతీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ఉన్న చట్టాలు, రక్షణ హక్కులు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆడపిల్లలను చదివించాలన్నారు. కార్యక్రమంలో బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ కృష్ణ, ఆర్డీటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ వ్యాన్ బోల్తా



చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై దుకాణాలకు సరుకులు సరఫరా చేసే వ్యాన్ (గూడ్స్ వ్యాన్) శుక్రవారం అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలు.. అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తి సరుకులను వ్యాన్‌లో వేసుకుని పెనుకొండ వైపునకు బయలుదేరాడు. 44వ నంబర్ జాతీయ రహదారిపై చెన్నేకొత్తపల్లి దాటగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదు. అటుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. బోల్తా పడిన వ్యాన్‌ను జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు.

నకిలీలతో జర భద్రం

- విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి
- అధికారుల సూచనలు పాటించాలి
- ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో దుక్కులు ప్రారంభం



బత్తలపల్లి: కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అకాల వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. రుతుపవనాలు వచ్చే సమయం ఆసన్నమయ్యింది. దీంతో రైతులు తమ పొలాలను దున్నే పనుల్లో నిమ్మగ్నమయ్యారు. వాతావరణం పూర్తీ స్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో రైతులు విత్తనాలు చల్లే పనులు చేపట్టనున్నారు. బత్తలపల్లి మండలంలో ఈ సీజన్‌లో ముఖ్యంగా వేరుశనగ పంటపైనే రైతులు దృష్టి సారించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే వరి పంటపైన దృష్టిసారిస్తారు. వ్యవసాయశాఖ ద్వారా అందించే రాయితీ విత్తనాలే కాకుండా రైతులు ప్రైవేట్ దుకాణాల్లో లభించే విత్తనాలపై ఆధారపడుతున్నారు. తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి నిచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ కొందరు వ్యాపారులు ఇప్పటికే రైతులను మభ్యపెడుతున్నారు.

మోసపోతే భారీ నష్టమే

నకిలీ విత్తనాల భారిన పడి రైతులు ప్రతి ఏడాది అధికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలను ముందే గుర్తించకపోతే నష్టపోక తప్పదని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. అధికారుల సూచనలు, జాగ్రత్తలు తప్పక పాటించాల్సి ఉంది. తగు జాగ్రత్తలు తీసుకొంటే నష్టపోయిన వారు సంబంధిత కంపెనీల నుంచి పరిహారం పొందవచ్చు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి..

వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వ అనుమతిలేని అనధికార విత్తన వ్యాపారాలు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉన్నందున వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొన్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లులపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తన ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్రం బిల్లు తమ పంట చేతికి వచ్చే వరకు రైతులు భద్ర పరుచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరిక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలక ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కొరకు పంట కోతకు వచ్చే వరకు దాచుకోవాలి.

బిల్లులు భద్రపరుచుకోండి..



నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులు విత్తన నాణ్యత ప్రమాణాలకన్నా తక్కువ మొలక శాతం నుంచి దిగుబడి ప్రభావితం చేసినట్లు భావిస్తే ఆ కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేయవచ్చు. వారి ద్వారా పరిహారం పొందడానికి బిల్లులు భద్రపరుచుకోవడం ద్వారా మోసపోయిన రైతులు నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై ఫిర్యాదు చేయవచ్చు. రైతులకు రాయితీ ద్వారా అందించే విత్తన కాయల పంపిణీ ఇప్పటికే ప్రారంభించారు.

– ఓబిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, బత్తలపల్లి

గంగాభవానీ మాత ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో అమ్మవారు

గాండ్లపెంట: స్థానిక గంగాభవానీ మాత ఉత్సవాలు శుక్రవారం ఉదయం కలశపూజ, అభిషేకంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు కత్తివారిపల్లి భజన బృందంచే భజన కార్యక్రమాలు చేపట్టారు. కాగా ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, రాత్రికి భక్తి పాటల కచేరీ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వర్షంతో ఉపశమనం



గాండ్లపెంటలో జోరుగా కురుస్తున్న వర్షం

గాండ్లపెంట: ఉక్కపోతతో అల్లాడిన జనానికి వర్షం రాకతో కాస్త ఉపశమనం కలిగింది. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకూ మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతం కావడంతో వేసవి తాపం నుంచి జనం చల్లని గాలితో సేదతీరారు. అదే విధంగా ఖరీఫ్ సాగుకు వర్షం అనుకూలం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీదేవి అలంకరణలో వాసవీమాత



కదిరి టౌన్: జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వాసవీ మాత అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. వాసవీమాత అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రుణాల రెన్యూవల్‌కు అడ్డంకులు పెట్టొద్దు



స్టేట్‌బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: లేనిపోని నిబంధనలు పెట్టి రైతుల పంట రుణాల రెన్యూవల్‌కు అడ్డంకులు సృష్టించొద్దని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా నాయకులు మహదేవ్, కదిరప్ప రైతులతో కలసి మామిళ్లపల్లి గ్రామీణ బ్యాంక్, కనగానపల్లి స్టేట్‌బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. రుణాల రెన్యూవల్ కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రదీప్ దృష్టికి తీసుకెళ్లారు. వన్‌బీ ద్వారా రెన్యూవల్ చేసుకోకుండా ప్రతి సర్వే నంబర్‌కు అడంగల్ కాపీలు కావాలని అడగటం, రైతుల పేర్లలో చిన్నచిన్న తప్పులకు అఫిడవిట్ కావాలని అడుగుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని సవరించుకుని రెన్యూవల్ చేయాలని ఎన్నిమార్లు చెప్పినా అలాగే చేస్తుండటంపై బ్యాంకు మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి రైతు సంఘం నాయకులకు సర్దిచెప్పారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా గతంలో ఉన్న నిబంధనల ప్రకారమే రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. కనగానపల్లి స్టేట్‌బ్యాంకు దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడారు. వీఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్ సంతకాల ద్వారా కూడా రెన్యూవల్ చేసుకోవాలని స్థానిక బ్యాంకు మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

ఆహారం బాగో లేకుంటే చర్యలు తప్పవు



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద హోటల్‌ను తనిఖీ చేస్తున్న కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి

పుట్టపర్తి టౌన్: రెస్టారెంట్లు, హోటళ్లలో ఆహారం బాగో లేకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణచక్రవర్తి నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం పుట్టపర్తి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద పలు రెస్టారెంట్లు, హోటళ్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రతో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. కల్తీ ఆహారం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం, ఉచిత చికిత్స కోసం వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో జనం పుట్టపర్తికి వస్తుంటారన్నారు. అలాంటి వారికి నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రుచికరంగా ఉండేందుకు ఆహారంలో టేస్టింగ్ సాల్ట్ , కలర్ పొడరుతో రకరకాల కెమికల్స్ వాడటం వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాటికి తగిన గాలి వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫుడ్ సేఫ్టీ కార్యాలయం నుంచి అనుమతులులేని హోటళ్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలి

కనగానపల్లి: ఆన్‌లైన్‌లో భూముల వివరాలు సక్రమంగా రాకపోవటంతో పంట రుణాల రెన్యూవల్‌కు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వాటిని సవరించి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు రెవెన్యూ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. భూములు రీ సర్వే జరిగిన కొన్ని గ్రామాల్లో ఆన్‌లైన్ పోర్టల్లో వన్‌బీ, ఆడంగల్ కాపీలు రావడం లేదన్నారు. దీంతో రైతులు రెవెన్యూ, మీ–సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. వాటిని సరిచేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు మహదేవ్, కదిరప్ప, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

తనకల్లు: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న భుక్యా నాగరాజునాయక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ధరణిబాబు శుక్రవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని పెనుగొండ తండాకు చెందిన అతడు కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి పెద్దపల్లి క్రాస్ సమీపంలో పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సాలోమన్, వైద్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సాలోమన్ ఆధ్వర్యంలో ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాలు వయసు దాటిన వారు ఆరు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలన్నారు. ఆహార నియమాలు, వాకింగ్, ఇతర వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మాధవి, హరి, శ్రీనివాస్, శైలజ, సురేఖ, కిరణ్, శ్రావణి, శ్వేత, పుష్పలత, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, జైతున్‌బీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



సుబహాన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన వార్డు సభ్యురాలు భాను భర్త, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నేత సుబహాన్(45) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని సుభహాన్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, బచ్చు సుజాత, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

బత్తలపల్లి: ప్రభుత్వం నిర్ణయించిన రూ.270లు కూలీ కూలీలకు అందాలంటే కొలతల మేరకు పని చేయాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉందని, కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనం పడాలంటే కొలతల మేరకు పని చేస్తే వస్తుందన్నారు. ఆ మేరకు కూలీలకు కొలతలు చూపించాలని ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలు పనులు అడిగితే వెంటనే కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



బుచ్చయ్యగారిపల్లిలో అడ్మిషన్ చేసుకుంటున్న హెచ్ఎం జగదీశ్వర్, సిబ్బంది.

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బుక్కపట్నం బాలుర పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులలో చేరే విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్నామని హెచ్ఎం జగదీశ్వర్ శుక్రవారం తెలిపారు. ఆయన బుక్కపట్నం మండలంలోని పలు గ్రామాల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రవేశాలు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ అడ్మిషన్లు కల్పించటం గ్రామీణ విద్యార్థులకు వరమని, వారికి పూర్తి ఉచితంగా విద్యనందిస్తామన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఇసాక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాసవీమాత జయంతి

తలుపుల: మండలకేంద్రంలోని ఆర్యవైశ్య ఆలయంలో శనివారం వాసవీ మాత జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆర్యవైశ్యులు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

పోలింగ్ @ 89.88 శాతం



కనగానపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- కనగానపల్లి మండలంలో గతం కన్నా పెరిగిన ఓటింగ్ శాతం
- భారీగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్న జనం
- మెజారిటీపై ఎవరి ధీమా వారిది

కనగానపల్లి: మండలంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం గతంలో కన్నా బాగా పెరిగింది. మండల వ్యాప్తంగా ఉన్న 37 పోలింగ్ కేంద్రాల్లో 30,356 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఎన్నికల్లో 89.88 శాతం ఓటింగ్ నమోదైంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారు. మండలంలో మొత్తం 33,771 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 15,591 మంది పురుషులు, 14,764 మంది మహిళలు ఓటు వేశారు.

మెజారిటీ మాకంటే మాకే..

మండలంలో ఓటింగ్ శాతం పెరగటంతో మెజారిటీపై రాజకీయ పార్టీల నాయకులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా గత 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 1,500 పైగా ఓట్ల మెజారిటీ దక్కింది. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారంతా తమకే ఓట్లు వేశారని, ఈసారి కూడా మాకే మంచి మెజారిటీ వస్తుందని అధికార పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. అయితే గతంలో మండలంలో జరిగిన ఏ ఎన్నికల్లో కూడా ఎవ్వరికీ 2 వేల పైగా మెజారిటీ రాకపోవటంతో ఏ పార్టీ అభ్యర్థి కూడా కనగానపల్లి మండలంపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదని తెలుస్తోంది.

మండలంలో గ్రామాల వారీగా నమోదైన పోలింగ్ వివరాలు

గ్రామం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
కొండపల్లి	1	995	879	88.34
తూంచర్ల	2	1739	1485	85.39
సీఎన్ కోట	1	757	600	79.26
గుంతపల్లి	1	720	663	92.08
భానుకోట	1	1214	1073	88.38
వేపకుంట	2	1758	1565	89.02
మద్దెలచెరువు	2	2030	1850	91.13
శివపురం	1	1062	996	93.78
కేఎన్ పాళ్యం	1	1258	1112	88.39
నరసంపల్లి	1	886	805	90.85
సోమర వాండ్లపల్లి	1	453	421	92.93
పాతపాళ్యం	1	758	686	90.50
తగరకుంట	3	2553	2272	88.99
బద్దలాపురం	1	1270	1194	94.01
యలకుంట్ల	1	1078	933	86.54
నెమలివరం	1	535	498	93.08
ముత్తువకుంట్ల	2	2302	2108	91.57
కనగానపల్లి	4	3461	3078	88.93
రాంపురం	1	570	492	86.31
కోనాపురం	1	1171	1081	92.31
బాలేపాళ్యం	1	894	833	93.17
పర్వతదేవరపల్లి	1	717	642	89.53
ముక్తాపురం	1	1042	949	91.07
మామిళ్లపల్లి	2	1748	1573	89.98
కుర్లపల్లి	1	1120	1020	91.07
చంద్రశ్చర్ల	1	1099	1012	92.90
దాదులూరు	1	571	536	93.87
మొత్తం	37	33,771	30,356	89.88